# అబ్దుల్ కరీం ఖాన్ (ఖాన్ సాహెబ్ )

## సర్వం శ్రీసాయి సేవా ట్రస్ట్

Regd. 192/2019



సర్వం శ్రీసాయి

## అబ్దుల్ కరీం ఖాస్ (ఖాస్ సాహెబ్ )

ఇప్పుడు మనం తెలుసుకునే ఈ లీల ఒక ప్రముఖ సంగీత కారునికి సంబంధించిన అద్భుతమైన లీలా. ఆయన తన గాన మాధుర్యంతో శ్రీ సాయిబాబాని ఆనంద పారవశ్యంలో ముంచెత్తారు. ఆయన పేరు అబ్దుల్ కరీం ఖాస్. ఆయన ఉత్తర ప్రదేశ్ లోని కైరన గ్రామంలో నవంబరు 11వ తేదీ 1872వ సంవత్సరంలో జన్మించారు. ఆయన కుటుంబం కైరానాలోని సున్నీ కుటుంబానికి సంబంధించి దానిలో ఒక అంతర్గత భాగం. వారికి చిస్టీ సూఫీ సన్యాసులంటే ఎంతో గౌరవభావం. ముఖ్యంగా మధ్య ఆసియా ద్వారా ప్రయాణించి రాజస్థాన్ అజ్మీర్ లో స్థిరపడిన పెర్షియన్ సన్యాసి మౌనుద్దీన్ చిస్టి పట్ల వారికెంతో గౌరవ భావం.

అబ్దుల్ కరీం వారి సోదరులు చిన్నతనం నుంచే వారి తండ్రిగారి వద్ద సంగీతాన్ని అభ్యసించారు. వారంతా ఆధ్యాత్మిక సూఫీ జానపద సంగీత కళాకారులుగాను, సారంగీ వాయిద్యకారుల కుటుంబంగా తమ జీవితాన్ని ప్రారంభించి, తరతరాలుగా వస్తున్న సంగీతాన్ని కొనసాగించారు.

1915వ సంవత్సరంలో ఆ సంగీత కళాకారుల బృందం సంచారం చేస్తూ సంగీత కార్యక్రమాలకు వెలుతున్నారు. అబ్దుల్ కరీం ఖాస్ గారు ఆసమయంలో వారితో పాటుగా ఆజ్మీర్ లో ఉన్నారు. అప్పుడే వారికి శ్రీసాయిబాబా గురించి తెలిసింది. ఆయనకి సాధువులు, సన్యాసుల యందు ప్రేమ, భక్తి భావం ఉన్నాయి. ప్రతాప్ సేఠ్ గారి స్వగృహంలో జరుగుతున్న ఒక శుభ కార్యక్రమానికి వీరి బృందం హాజరయింది. ఆసమయంలో అక్కడ బూటీ కూడా ఉన్నారు.శ్రీ సాయిబాబా వారి లీలలు మరియు వారి శక్తి బూటీ ద్వారా అబ్దుల్ కరీం ఖాస్ గారు విన్నారు. అ మాటలు ఆయనని మంత్రముగ్ధుడ్ని చేశాయి. అక్కడ జరిగిన కార్యక్రమానికి సాయి

భక్తులు చాలా మంది వచ్చారు. వారంతా కూడా అబ్దుల్ కరీం గారిని షిరిడీ వచ్చి సాయి మహరాజ్ గారి సమక్షంలో గానం చేయమని అభ్యర్థించారు. ఖాస్ సాహెబ్ గారు వారు చెప్పినదానికి వెంటనే ఒప్పుకొని తన మాలెగాస్ ప్రయాణాన్ని రద్దు చేసుకొని షిరిడీకి ప్రయాణమయ్యారు.

ఆరోజులలో షిరిడీ విస్తారమైన అడవి.అక్కడ పాములు, యింకా యితర ప్రాణులు సంచరిస్తూ ఉండేవి. ఇక్కడే శ్రీ సాయిబాబా ఉండేవారు. ద్వారకామాయిలో సాయిబాబా , తాత్యా, షామా యింకా ఇతర భక్తులతో మాట్లాడుతున్నారు. అబ్ధుల్ కరీం ఖాస్ గారు తన సహచరులతోను, వాయిద్య పరికరాలతోను బూటీతో అక్కడకు చేసుకున్నారు. ఖాస్ సాహెబ్ గారు షిరిడీకి రాగానే ఆయనకి కోతె పాటిల్ యింటిలో బస ఏర్పాటు చేశారు. కాని ఆయన శ్రీ సాయిబాబా వారి దర్శనానికి సాయంకాలం వరకు వేచి ఉండాల్సి వచ్చింది. సూర్యాస్తమయం అయినప్పటికీ శ్రీసాయిబాబా తన నివాసం నుండి బయటకు వచ్చారు. ఖాస్ సాహెబ్ గారికి తాను ఒక మహా పురుషుడయిన సాధువు ముందు ఉన్న అనుభూతి కలిగింది. పరిచయాలు అయిన తరువాత బాబా ఆయనను ఒక భజన పాట పాడమన్నారు. ఖాస్ సాహెబ్ గారు సంగీత పరికరాలను వాయించే వారిని పిలిచారు. అప్పుడు బాబా "వాయిద్యాలు ఏమీ అవసరం లేదు. నువ్వు పాట పాడు" అన్నారు.

ఖాస్ సాహెబ్ గారు "హే చి దాస్ దేగా దేవా, తురుఝా విసార్ న వ్హావా" (నేను నిన్ను మరవకుండా ఉండే వరమివ్వు) అని చాలా మెల్లగా మృదువుగా ఎటువంటి మేళతాళాలు లేకుండా పాడారు. బాబా ఆయన పాడినది ఎంతో శ్రద్ధగా పరవశంతో విన్నారు. అప్పుడు బాబా "షామా, పిలు రాగం ఎంత అద్భుతమైనదో చూడు, ఆయన పాడుతున్నది వాస్తవంగా నాద బ్రహ్మ. అటువంటి సంగీతం భగవంతునికి నిశ్చయంగా సంతోషాన్ని కలుగచేస్తుంది" అన్నారు.

అప్పటికింకా బాబా భువికి దిగి వచ్చిన భగవంతుడని ఆయన సంరక్షణలో అనారోగ్యంతో ఉన్న తన కుమార్తెకు గుణమవుతుందని ఖాస్ సాహెబ్ ఏమాత్రం గ్రహించలేకపోయాడు.

బాబా, ఖాస్ సాహెబ్ గారి వైపు తిరిగి "ఇప్పుడు సంతోషంగా ఉండు. వెళ్ళిపోదామని హడావిడి పడకు. నీకుటుంబాన్ని కూడా యిక్కడకు వచ్చి కొద్ది రోజులు ఉండమను" అన్నారు .

మరునాడు ఖాస్ సాహెబ్ కి ఆయన భార్య (తారాబాయ్) నించి తంతి వచ్చింది. అందులో ఆయన కుమార్తెకి చాలా జబ్బుగా ఉందనీ, వెంటనే యింటికి రమ్మని సందేశం యిచ్చింది.

ఖాస్ సాహెబ్ గారు తంతిని పట్టుకొని వచ్చి బాబాకి యిచ్చారు. బాబా ఆయనను ఓదార్చి కుటుంబాన్ని షిరిడీకి తీసుకురమ్మని చెప్పారు. ఖాస్ సాహెబ్ గారు తన భార్యని, కుమార్తెను షిరిడీకి రప్పించారు.

ఆయన చావుకు దగ్గరగా ఉన్న తన కుమార్తెను మోసుకొని వచ్చి బాబా పాదాల వద్ద పడుకోబెట్టారు. బాబా తన చిలుములోనించి కొంత బూడిదను తీసి దానిని బెల్లంలో కలిపారు. దానిని నీటిలో కలిపి ఖాస్ సాహెబ్ గారి కుమార్తె చేత తాగించారు. రెండు రోజుల తరువాత బాబా చేసిన వైద్యానికి ఖాస్ గారి కుమార్తె గులాబ్ కలి లేచి నిలబడగలిగింది. బాబా తానే స్వయంగా ఖాస్ సాహెబ్ గారిని అనుగ్రహించారు.

వారు 10రోజులు షిరిడీలోనే ప్రశాంతంగా ఉన్న తరువాత వారికి షిరిడీ నుండి వెళ్ళడానికి అనుమతి ప్రసాదించారు బాబా.

సర్వం శ్రీసాయినాధార్పణమస్తు